క్లుప్తంగా

అరసం జాతీయ మహాసభలకు అప్పలరాజు



సీతంపేట: ఈ నెల 21, 22 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జరగనున్న అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ మహాసభలకు రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కవి, కథా నాటక రచయిత ఉప్పల అప్పలరాజు హాజరు కానున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు నిర్వాహక కమిటీ నుంచి ప్రత్యేక ఆహ్వానం వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా అరసం ప్రతినిధులు పి.శ్యామ్‌సుందర్, క్షేత్రపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు అప్పలరాజుకు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. అర్జీలను కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలువురు వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధి ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, ఏపీ ఐఐసీ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతమంతా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

అలరించిన గీతాలాపన

సీతంపేట: రాగమాలిక సాంస్కృతిక సంస్థ 15వ వార్షికోత్సవం శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు మీనాకుమారి, ఆదిలక్ష్మి, ఇందిరా సాహిని, శైలజ, శ్వేత, సుబ్బారావు, పార్థసారధి, భరద్వాజ్, రాజు, చింతపల్లి సత్యనారాయణ, ఆనందరావు అలనాటి మేటి గీతాలను ఆలపించి అలరించారు. ముందుగా ఇటీవల పరమపదించిన జానపద ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

కారును ఢీకొట్టిన ఘటనలో వ్యక్తిపై కేసు

మర్రిపాలెం: మద్యం మత్తులో పార్కింగ్‌లో ఉన్న కారును మరో కారుతో ఢీకొట్టిన వ్యక్తిపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్‌కు చెందిన పి.రామకృష్ణ తన నివాసంలో కారు పార్క్‌చేసి ఉంచగా.. ఈ నెల 7న రాత్రి మద్యం మత్తులో అనిల్ అనే వ్యక్తి కారు నడుపుతూ ఆ కారును ఢీకొన్నాడు. పెద్ద శబ్దం రావడంతో రామకృష్ణ బయటకి వచ్చి చూడగా కారు ధ్వంసమైంది. సదరు వ్యక్తి కారును మరమ్మతు చేయిస్తానని ఒప్పుకుని తర్వాత నుంచి కనబడలేదు. దీంతో బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

డ్రైడేతో దోమలకు చెక్



ఎన్జీజీవోస్ కాలనీలో ఫ్రైడే-డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న ఏఎల్‌వో సిబ్బంది



జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జోన్-5 అధికారులు

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని, లేదంటే దోమలు వృద్ధి చెందుతాయని జీవీఎంసీ మలేరియా సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ అన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు ఆయన అవగాహన కల్పించారు. వర్షా కాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులు, మనీ ప్లాంట్‌లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్‌బాక్సులను శుభ్రం చేసి మళ్లీ నీరు పట్టుకోవాలని సూచించారు. గోళాలు, కుండీల్లోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో పనికి రాని వ్యర్థాలు వాడిపారేసిన టీ కప్పులు, ఐస్‌క్రీం కప్పులు, తాగిపారేసిన కొబ్బరి బొండాలు, డ్రింక్ బాటిళ్లు వంటివి లేకుండా చూడాలని చెప్పి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది శివ, యాంటీ లార్వా ఆపరేషన్స్(ఏఎల్‌వో) సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్‌లో శుక్రవారం దోమల నిర్మూలనపై జోన్-5 అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్రైడే-డ్రైడే తప్పనిసరిగా పాటించాలని స్థానికులకు సూచించారు. ఈ సందర్భంగా జోన్-5 శానిటరీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ దోమల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఇంటి ముందు నీరు నిల్వలు ఉంచవద్దని, వాటిలోనే డెంగ్యూ కారక దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలుతాయన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా పరిసరాలను పొడిగా, శుభ్రంగా ఉంచాలని అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి రోడ్డు ప్లాన్‌ను పరిశీలిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ అభివృద్ధి పనులపై శుక్రవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో జోన్-3, 5ల టౌన్ ప్లానింగ్ అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీతమ్మధార నుంచి మురళీనగర్, మాధవధార మీదుగా మారియట్ హోటల్ వరకు వెళ్లే గిరిప్రదక్షిణ రోడ్డు విస్తరణ పనులు, నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నగర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఉత్తర నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కోట్ల రూపాయలను బాధిత కుటుంబాలకు అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పలు రోడ్లు, సామాజిక భవనాల నిర్మాణం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందించామని చెప్పారు. పార్కుల అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, జోన్-3, 5ల ఏసీపీలు శాస్త్రి, రఘునందనరావు, ఈఈ శ్రీనివాసరావు, డీఈ భరణి, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, వి.ప్రసాద్, కె.వి.ఎస్.శశికళ, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, పట్టణ ప్రణాళిక విభాగం టీపీవో తేజ, పార్టీ వార్డు అధ్యక్షులు నీలి రవి, పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సద్భావనా దివస్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో సద్భావనా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం వద్ద ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ అధికారులు, సిబ్బంది చేత సద్భావనా ప్రతిజ్ఞ చేయించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఆగస్టు 20న సద్భావనా దివస్‌గా పాటిస్తారు. ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీ ఆదివారం కావడంతో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. రాజీవ్ జయంతిని దేశ ప్రజల మధ్య జాతీయ సమైక్య, శాంతి, సామాజిక సమానత్వం, ఐక్యతలకు గుర్తుగా అవలంబిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుదీర్‌కుమార్ గుప్తా, ఇతర బ్రాంచి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



51వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



42వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో తాగునీటి బోరు ఏర్పాటుకు శుక్రవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ శంకుస్థాపన చేశారు. ఇక్కడ కళావేదిక పనులు జరుగుతున్న నేపథ్యంలో స్థానికులు బోరు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా.. కార్పొరేటర్ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు.

ఈ మేరకు బోరు పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సారిక నూకరాజు, శ్యామ్, కాంట్రాక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సన్యాసి అప్పారావు, ప్రసాద్, శ్యామ్, రాజు, అంబేడ్కర్ కాలనీ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు పరిధి దొండపర్తి ఎరుకుమాంబ ఆలయం సమీపంలో బోరు ఏర్పాటుకు శుక్రవారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. స్థానికులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలియజేయగా.. ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి బోరును మంజూరు చేయించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, వార్డు సీనియర్ నాయకులు సబ్బి నూకరాజు, వెంకటేష్, కంచు రమణమూర్తి, బోర శ్రీనివాస్‌రెడ్డి, మొల్లేటి జగన్, సురేంద్రలాల్, చందన్‌సాయి, వెంకటరత్నం, దుర్గ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు 'శ్రావణ' పూజలు



అలంకరణలో అమ్మవారు

సీతమ్మధార: తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన మహాలక్ష్మి దుర్గమ్మ వారికి ప్రధాన అర్చకుడు రాజాస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష కుంకుమార్చన, పుష్పార్చన, సుగంధ ద్రవ్య పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయంలో సాయంత్రం భక్తులు భక్తిశ్రద్ధలతో లలితా పారాయణ నిర్వహించారు. ఆలయ సిబ్బంది శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న హజీద్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్‌కు చెందిన హజీద్ ఈ నెల 15న తన కుమార్తెను తీసుకుని కేంద్రీయ విద్యాలయ స్కూల్‌కు బైక్‌పై బయలుదేరాడు. పోర్టు ఆస్పత్రి నుంచి యూటర్న్ తీసుకున్న సమయంలో అక్కయ్యపాలెం నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో హజీద్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడిని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ మోహనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులతో ఎంప్లాయిమెంట్ అధికారులు, సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ (క్లరికల్) అధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించినట్లు తెలియజేశారు. ఫైజర్ ఇండియా, ఏషియన్ పెయింట్స్, ఇండిగో ఎయిర్ లైన్, వింధ్యా ఇ- ఇన్ఫోమీడియా, సెంట్రల్ ఫార్మసీ, బీపీసీఎల్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, మాక్స్ ఫ్యాషన్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 457 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 253మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. వారిలో 64మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందించారు. ఉపాధి శిక్షణ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవీ లత జాబ్‌మేళాలో అభ్యర్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మేధాశక్తితో ఉన్నత శిఖరాలకు..



హెచ్‌ఎం శ్రీనివాసరావును సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

కంచరపాలెం: విద్యార్థులు మేధాశక్తిని పెంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అర్.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. హైస్కూల్‌లో శుక్రవారం భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీబాయి నారీ శాఖల సంయుక్తంగా వికాస్ సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పుస్తకాలతోకూడిన విద్యా సామగ్రిని అందజేశారు. ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకుని సంస్కారవంతులుగా ఎదగాలన్నారు. అనంతరం హెచ్‌ఎం శ్రీనివాసరావును సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సత్యనారాయణ, రఘువీర్, నాగేశ్వరరావు, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐఈఈఈ విద్యార్థి విభాగం ప్రారంభం



మాట్లాడుతున్న పాల్ విలియమ్స్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ పరిశోధన, అభివృద్ధి ప్రచార సంస్థ(ఐఈఈఈ) విద్యార్థి విభాగాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథి బీఎస్ఎస్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలక పాల్ విలియమ్స్ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ సాంకేతిక, నైపుణ్యాలను అలవర్చుకుని రాణించాలన్నారు. ఎన్ఎస్‌టీఎల్, డీఆర్‌డీఏ శాస్త్రవేత్త సిహెచ్.అనిల్‌కుమార్ మాట్లాడుతూ రక్షణ వ్యవస్థలో రాడార్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ ఐఈఈఈ విశిష్టత, సభ్యత్వం గురించి తెలియజేశారు. యువత సాంకేతికను అందిపుచ్చుకుని అభిరుచికి తగ్గ రంగంలో రాణించి భవిష్యత్‌లో ఎన్నోమార్పులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి సాల్మన్ జె.వి.గౌతం విద్యార్థులనుఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపక కౌన్సిలర్ ఆర్.సంతోష్ సాయి, ఐఈఈఈ విద్యార్థి కౌన్సిలర్ పి.సాయికిరణ్, ఇతర విభాగాధిపతులు, ఈసీఈ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన రోబోటిక్ సర్జరీ



సర్జరీ అనంతరం కోలుకున్న నరేష్‌తో డాక్టర్ కార్తీక్ చంద్ర తదితరులు

ఎంవీపీ కాలనీ: మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఓ రోగికి అరుదైన రోబోటిక్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లాకు చెందిన జి.నరేష్(36) తీవ్ర జ్వరంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కారణంగా ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగంలో చేరాడు. ఆయన్ను పల్మోనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తాలే పరీక్షించి క్షయవ్యాధి కారణంగా ఊపిరితిత్తుల చుట్టూ(ప్లూరల్ ఎఫ్యూషన్) నీరు ఉందని గుర్తించారు. శస్త్ర చికిత్స ద్వారా ఆ నీరును తొలగించాలని సూచిస్తూ రోబోటిక్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కార్తీక్ చంద్రకు రిఫర్ చేశారు. అనంతరం వీఏటీఎస్(థొరాకోస్కోపిక్) డెకార్టికేషన్ రోబోటిక్ సర్జరీ ద్వారా ఊపిరితిత్తుల విస్తరణను నిరోధించే కణజాల పొరతో పాటు ఊపిరితిత్తుల చుట్టూ ఉన్న నీరును తొలగించారు. శరీరంపై 5-6 సెంటీమీటర్ల చిన్నపాటి రంధ్రం ద్వారా సున్నితమైన ఈ సర్జరీని డాక్టర్ కార్తీక్ చంద్ర బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోగి వేగంగా కోలుకుని, 4 రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ చంద్ర బృందాన్ని ఆస్పత్రి వర్గాలు అభినందించాయి.

కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి సాయం

డీఎంహెచ్‌వో చేతుల మీదుగా రూ.1.68 లక్షల అందజేత



హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మద్దిలపాలెం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ పుట్టా రాజేంద్ర ప్రసాద్ కుటుంబానికి సహచర కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు, ఏపీఎన్‌జీవో నాయకులు రూ.1.68 లక్షలు ఆర్థిక సాయం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ల నుంచి రూ.1.18 లక్షలు, మృతుడు పనిచేసిన పెందుర్తి ఆరోగ్యకేంద్రం సిబ్బంది రూ.40 వేలు, ఏపీఎన్‌జీవో నాయకులు రూ.10 వేలు సేకరించి ఆ మొత్తాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అకస్మాత్తుగా మరణించిన తమ సహచరుని కుటుంబానికి అండగా నిలిచిన సిబ్బంది తీరును అభినందించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున సాయం అందేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లకు ఏ కష్టమొచ్చినా సాయం చేసేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి రవిశంకర్, నగర అధ్యక్షుడు నారాయణరావు, కోశాధికారి ఏవీఎస్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, జిల్లా సంయుక్త కార్యదర్శి నరం నాయుడు, పెందుర్తి సీహెచ్‌వో స్వర్ణలత, కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు పేరినాయుడు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు వాసి.. విశాఖలో అదృశ్యం



అక్తర్ అన్సారీ

తాటిచెట్లపాలెం: బెంగళూరుకు చెందిన యువకుడు(19) విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో అదృశ్యమైనట్లు గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరుకు చెందిన అక్తర్ అన్సారీని అతడి సోదరుడు ఏప్రిల్‌లో బెంగళూరు నుంచి విశాఖపట్నం రైలెక్కించాడు. విశాఖలో దిగే వరకు ఫోన్ కాంటాక్ట్‌లో ఉన్నారు. ఇక్కడ దిగిన తరువాత సిగ్నల్ కట్ అయింది. ఆపై యువకుడి సమాచారం తెలియలేదు. బెంగళూరులో బయలుదేరినపుడు ఎరుపు, నలుపు రంగు షర్ట్, నలుపు ప్యాంట్, తెలుపు ఇన్నర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడు. అక్తర్ అన్సారి సోదరుడు జీఆర్పీలో చేసిన ఫిర్యాదు మేరకు సీఐ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని రైల్వే పోలీసులకు గానీ లేదా 94406 27547/98664 13487 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

వ్యక్తి ప్రగతిలో అంతర్గత ప్రేరణ కీలకం

ఏయూ క్యాంపస్: అంతర్గత ప్రేరణే వ్యక్తి ప్రగతిలో కీలకమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి సీఏ విద్యార్థుల సదస్సు సంకల్ప్-23ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ యువత కొత్త ఆలోచనలు దేశానికి పెద్ద సంపదగా మారనున్నాయన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి అసాధారణ ప్రగతిని సాధించిన వ్యక్తులు ఈ రెండు రోజులు స్ఫూర్తి ప్రసంగాలు చేస్తారన్నారు. ఎస్ఎస్ఈబీ చైర్మన్ మంగేష్ పి.కినరే మాట్లాడుతూ నూతన కరిక్యులమ్‌ను అమలు చేస్తున్నామన్నారు. విదేశాల్లో కూడా తమకు 45 శాఖలు ఉన్నాయని, ప్రత్యక్ష శిక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీధర్ ముప్పల మాట్లాడుతూ సీఏ వృత్తిలో అడుగిడటం విజయానికి ఆరంభంగా మాత్రమే భావించాలన్నారు. సదస్సు సంచాలకుడు డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌కు అవసరమైన బలమైన పునాదులు నిర్మించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్‌సీ, సికాస చైర్మన్ ఆర్.చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఏకాగ్రతతో పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. సికాస చైర్మన్ స్వరూప్, వైస్ చైర్మన్ పి.నాని కార్తీక్, విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ ప్రసాద్ కె.పాండ, పెద్ద సంఖ్యలో సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

నిస్సహాయ స్థితిలో యువతి

బాసటగా నిలిచిన మమత చారిటబుల్ ట్రస్ట్



నడవలేని స్థితిలో ఉన్న యువతిని తరలిస్తున్న మమత

అల్లిపురం: ఆ యువతి ఎవరో తెలియదు.. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు.. రెండు రోజులుగా రైల్వే స్టేషన్‌లోని 2వ నంబర్ ప్లాట్‌ఫారంపై అచేతనురాలిగా పడి ఉంది. కదల్లేని స్థితిలో ఉన్న ఆమెను ఆర్‌పీఎఫ్ పోలీసులు గమనించి వివరాలు అడిగినా చెప్పలేకపోయింది. దీంతో వారు మమత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు మమతకు విషయం తెలిపారు. ఆమె అక్కడికి చేరుకుని యువతి నుంచి సమాచారం రాబట్టేందుకు ప్రయత్నించారు. తనది ఒడిశా రాష్ట్రం సమ్మల్‌పూర్ అని, పేరు లక్ష్మీ మహానంద్ అని యువతి చెప్పింది. గతంలో యాక్సిడెంట్ కావడంతో తన రెండు కాళ్లు దెబ్బ తిన్నాయని, నడవలేని స్థితిలో ఉన్నానని చెప్పడంతో రైల్వే స్టేషన్‌లోని బ్యాటరీ కారు ద్వారా బయటికి తీసుకొచ్చి అంబులెన్స్‌లో కేజీహెచ్‌లో చేర్పించారు. ఆమె కోలుకున్న తర్వాత షెల్టర్‌లో చేర్చి ఆశ్రయం కల్పిస్తామని మమత తెలిపారు.

పబ్లిక్ డిమాండ్

రాకపోకలకు ఇబ్బందులు



కొత్తరెడ్డి కంచరపాలెం రోడ్డులో అడ్డంగా వాహనాలు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం గంగన్ననగర్, యల్లబిల్లివారి వీధి, జోగారావునగర్ ప్రాంతాల మీదుగా జాతీయ రహదారికి వెళ్లే మార్గం ఇరుగ్గా మారుతోంది. ఈ రహదారిలో కొత్తరెడ్డి కంచరపాలెంలోని హోల్‌సేల్ దుకాణాలకు వచ్చే వాహనాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం ఈ దారిలో వేల సంఖ్యలో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలను నిలపడం వల్ల ఇబ్బంది పడుతున్నాం. ట్రాఫిక్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– ఎస్.ఈశ్వరరావు, యల్లబిల్లివారి వీధి